క్లుప్తంగా

కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.315

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో శనివారం కిలో పొగాకుకు గరిష్ఠ ధర రూ.315 ధర లభించింది. వేలంలో కిలో పొగాకు గరిష్ఠంగా రూ.315, కనిష్ఠంగా రూ.69, సగటున రూ.190.46 ధర లభించిందని వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలంలో 11 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మర్రిపాడు: మండలంలోని 33/11 కేవీ మర్రిపాడు సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ ఏ హరికృష్ణ శనివారం తెలిపారు. సబ్‌స్టేషన్ నిర్వహణ దృష్ట్యా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు సరఫరాను నిలిపివేస్తున్నామని వివరించారు.

వేగ నిరోధకాల ఏర్పాటు



సంగం: మండల పరిధిలోని నెల్లూరు–ముంబై జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల నివారణకు ఎస్సై రాజేష్ చర్యలు చేపట్టారు. శనివారం పెరమన, సంగం, దువ్వూరు జంక్షన్‌ల వద్ద రేడియం స్టిక్కర్లతో కూడిన డ్రమ్ములతో వేగనిరోధకాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు వేగ నియంత్రణను పాటించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యార్థులకు వైద్యపరీక్షలు



వింజమూరు(ఉదయగిరి): వింజమూరులోని ఎస్సీ బాలుర, బాలికల బీసీ వసతి గృహాల్లోని విద్యార్థులకు వైద్య ఆరోగ్య సిబ్బంది శనివారం వైద్య పరీక్షలు చేశారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. పరిసరాల, వ్యక్తిగత శుభ్రతను పాటించాలని సూచించారు. ఎంఎల్‌హెచ్‌పీ విజయలక్ష్మి, వసతిగృహాల అధికారులు భారతి, భాస్కర్‌రావు, లత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు గేదె మృతి

కొండాపురం: పిడుగుపాటుకు పాడి గేదె మృతి చెందిన ఘటన భీమవరప్పాడులో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బీ వెంకయ్య రోజూలాగే ఇంటి బయట గేదెను కట్టేసి ఉంచగా పిడుగుపడడంతో మృతి చెందింది. పాడి గేదె విలువ సుమారు రూ.1.20 లక్షలు ఉంటుందని, గేదె మృతితో జీవనోపాధి కోల్పోయానని బాధిత రైతు వాపోయారు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని కోరారు.

ప్రమాదభరితంగా ఫ్యూజ్‌బాక్స్



సీతారామపురం : మండలంలోని అయ్యవారిపల్లి ఎస్సీ కాలనీలో వీధి దీపాలకు సంబంధించిన ఫ్యూజ్ బాక్స్ ప్రమాదభరితంగా ఉంది. విద్యుత్ స్తంభానికి చిన్నపిల్లల చేతికందే ఎత్తులో ఫ్యూజ్ బాక్సును ఏర్పాటు చేయడం..దానికి మూత లేకపోవడంతో స్థానికులు భయాందోళనలు చెందుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి రక్షణ చర్యలు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

వర్షం పడితే చెరువే



వరికుంటపాడు: మండలంలోని తిమ్మారెడ్డిపల్లి ఎస్సీ కాలనీ వద్ద తిమ్మారెడ్డిపల్లి–వింజమూరు రోడ్డు అధ్వానంగా తయారైంది. రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడడంతో వర్షం పడితే నీరు నిలిచి చెరువును తలపిస్తోంది. వర్షపు నీటిలో గుంతలు కనిపించకపోతుండడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనచోదకులు ప్రమాదాల పాలవుతున్నారు. మరోవైపు గుంతల్లో వర్షపు నీరు రోజుల తరబడి నిల్వ ఉంటూ దోమలు వ్యాప్తి చెందుతూ ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. సంబంధించి అధికారులు స్పందించి గుంతలను పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణపై ఉద్యమం





బోగోలు, ఆత్మకూరులో కోటి సంతకాల సేకరణ ఉద్యమ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బిట్రగుంట: రాష్ట్రంలో పేద ప్రజలకు ఉచితంగా నాణ్యమైన వైద్యాన్ని, వైద్యవిద్యను అందించాలనే లక్ష్యంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్మాణానికి శ్రీకారం చుడితే, వాటిని ప్రైవేటీకరణ చేయడం ద్వారా చంద్రబాబు పేదలకు వైద్యవిద్యను దూరం చేసేందుకు కుట్ర పన్నుతున్నారని వైఎస్సార్‌సీపీ బోగోలు మండలాధ్యక్షుడు మద్దిబోయిన వీర రఘు అన్నారు. బోగోలులోని పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 17 ప్రభుత్వ వైద్యకళాశాలలకు అనుమతులు మంజూరు చేయించడంతో పాటు ఐదు కళాశాలల నిర్మాణాన్ని పూర్తి చేసి తరగతులను ప్రారంభించినట్లు గుర్తుచేశారు. మిగిలిన కళాశాలల భవన నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. వైద్యకళాశాలలు, వాటికి అనుబంధంగా సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రులు వస్తే పేదలకు ఉచితంగా నాణ్యమైన వైద్యం అందుబాటులోకి వస్తుందన్నారు. అయితే కూటమి ప్రభుత్వం పీపీపీ విధానం పేరుతో పేదలకు నాణ్యమైన వైద్యం, వైద్యవిద్యను దూరం చేసే కుట్రలకు తెరతీసిందన్నారు. ప్రభుత్వ వైఖరిని ప్రజలు, ప్రజాసంఘాలు ఖండిస్తున్నా లెక్క చేయకుండా హడావిడిగా ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించేందుకు పావులు కదుపుతోందని మండిపడ్డారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోటి సంతకాల సేకరణ ఉద్యమానికి పిలుపునిచ్చారని తెలిపారు. కావలి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని ప్రతి గ్రామంలోని ప్రజల వద్దకు వెళ్లి ప్రభుత్వ కుట్రలను వివరించి సంతకాలను సేకరించనున్నట్లు తెలిపారు. మండలంలోని 16 పంచాయతీల్లో సుమారు పదివేల సంతకాలు సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నామని వివరించారు. ఈ నెల 23న మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో నిరసన ర్యాలీ చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం కోటి సంతకాల సేకరణ ఉద్యమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు.

తప్పుడు కేసులకు భయపడేది లేదు

వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా కూటమి ప్రభుత్వం పెడుతున్న తప్పుడు కేసులకు భయపడే పరిస్థితి లేదని మద్దిబోయిన వీరరఘు స్పష్టం చేశారు. కూటమి నేతల ఒత్తిడికి తలొగ్గి తప్పుడు కేసులు పెట్టే అధికారులు తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. డిజిటల్ బుక్‌లో ప్రతివిషయం నమోదవుతుందనే విషయాన్ని అధికారులు గుర్తుంచుకోవాలని సూచించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

సంతకాల సేకరణతో ప్రైవేటీకరణను అడ్డుకుంటాం

ఆత్మకూరు: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదలకు ఉచితంగా నాణ్యమైన వైద్యం, విద్యవిద్యను అందించే లక్ష్యంతో తీసుకొచ్చిన వైద్య కళాశాలలను పీపీపీ విధానం పేరుతో ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టే కుట్రలకు కూటమి ప్రభుత్వం తెరతీసిందని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ ఉద్యమానికి శ్రీకారం చుట్టిందని, కోటి సంతకాల సేకరణ ద్వారా ప్రైవేటీకరణను అడ్డుకుంటామని తెలిపారు. ఆత్మకూరులోని మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు నాగులపాటి ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ కోటి సంతకాల సేకరణ ఉద్యమ పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆత్మకూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పరిశీలకులు పేర్నాటి కోటేశ్వరరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ ఆదిశేషయ్య, పట్టణ అధ్యక్షుడు నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి కొండా వెంకటేశ్వర్లు, నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షుడు నందా ఓబులేసు మాట్లాడారు. నవంబర్ 22వ తేదీ వరకు రచ్చబండ కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి సంతకాల సేకరణ చేపట్టనున్నట్ల తెలిపారు. అక్టోబర్ 28న ఆత్మకూరులో నిరసన ర్యాలీలు చేపట్టనున్నట్లు వివరించారు. ఆత్మకూరు నియోజకవర్గంలో 60 వేల సంతకాలను సేకరించనున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు నోటి వినయ్ కుమార్‌రెడ్డి, పులిమి రమేష్‌రెడ్డి, ముతీవర్, కల్పనారెడ్డి, నందవరం ప్రసాద్, కౌన్సిలర్ కామాక్షయ్యనాయుడు, బాల అంకయ్య, తోడేటి మణి, మస్తాన్‌వలి, పాలేటి వెంగళరెడ్డి, మునీర్, కొండయ్య, నందవరం ప్రతాప్, సుబ్బారెడ్డి, జనార్దన్‌రెడ్డి, మీరామొహిద్దీన్, మల్లికార్జున, చైతన్య, మధు, సుబ్బయ్య, షారూక్, గోవర్ధన్, బ్రహ్మానాయుడు, విష్ణు, వెంకటేష్, అక్రమ్, ఆచారి, తదితరులు పాల్గొన్నారు.

కాటంరెడ్డికి ఘన స్వాగతం



అభిమానులు తెచ్చిన కేక్‌ను కట్ చేస్తున్న కాటంరెడ్డి

అల్లూరు: అల్లూరు మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డికి ఆయన అభిమానులు శనివారం ఘన స్వాగతం పలికారు. వైఎస్సార్‌సీపీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడిగా నియమితులైన తరువాత తొలిసారిగా అల్లూరులోని తన స్వగృహానికి కాటంరెడ్డి రావడంతో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున వచ్చి శాలువాలు, పూలమాలలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. భారీ కేక్‌ను కట్ చేసి పంచారు. ప్రజానాయకుడైన కాటంరెడ్డి మరెన్నో పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. కాటంరెడ్డికి పదవీ బాధ్యతలు అప్పగించిన వైఎస్ జగన్‌మోహన్‌కి కతజ్ఞతలు తెలిపారు. నాయకులు బాలకృష్ణంరాజు, గోసాల గోపాల్ రెడ్డి, పాలవల్లి పద్మనాభరెడ్డి, మాధవ్‌రావు, పీ మురళీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పి వంతెనను ఢీకొన్న మినీట్రక్కు

దుత్తలూరు : మండలంలోని తెడ్డుపాడు వద్ద ఉన్న పిల్లాపేరు వంతెనను మినీట్రక్కు శనివారం ఢీకొంది.విజయవాడ నుంచి ప్రొద్దుటూరుకు లోడ్‌తో వెళుతున్న మినీట్రక్కు అదుపుతప్పి వంతెనను ఢీకొంది. డ్రైవర్ అప్రమత్తమై బ్రేక్‌వేయడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనతో జాతీయ రహదారిపై కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. హైవే సిబ్బంది, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మినీట్రక్కును పక్కకు తరలించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు.

వైభవంగా పోలేరమ్మ విగ్రహ ప్రతిష్ఠ



విశేషాలంకారంలో పోలేరమ్మ



సీతారాముల కల్యాణోత్సవం

ఆత్మకూరురూరల్: మండలంలోని గండ్లవీడులో నూతనంగా నిర్మించిన పోలేరమ్మ ఆలయంలో జరుగుతున్న కుంభాభిషేక మహోత్సవాల్లో భాగంగా చివరి రోజు శనివారం పోలేరమ్మ, పోతురాజు విగ్రహాల ప్రతిష్ఠను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశేషాభిషేకాలు, పూజలు, హోమాలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

వైభవంగా సీతారాముల కల్యాణోత్సవం

పోలేరమ్మ కుంభాభిషేక మహోత్సవాల్లో భాగంగా రామాలయం వద్ద సీతారాముల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. టీటీడీ వేదపండితుల ఆధ్వర్యంలో సీతారాముల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపారు.

నేత్రపర్వంగా శ్రీవారి కల్యాణోత్సవం

సాతానుపల్లిలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక వేడుకల్లో భాగంగా శనివారం ఉదయం సుప్రభాతసేవ, అష్టోత్తర పూజ నిర్వహించారు. అనంతరం శ్రీవారి కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

వసతిగృహాలను శుభ్రంగా ఉంచాలి



బాలికల వసతిగృహంలో మరుగుదొడ్లను పరిశీలిస్తున్న రమణారెడ్డి

వింజమూరు(ఉదయగిరి): వింజమూరులోని బీసీ కాలనీలోని ఎస్సీ బాలికల, బాలుర వసతిగృహాలను ఉదయగిరి నియోజకవర్గ సంక్షేమ సహాయ అధికారి రమణారెడ్డి శనివారం తనిఖీ చేశారు. వసతిగృహాల పరిసరాలు, మరుగుదొడ్లను పరిశీలించారు. మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచాలని, వర్షాకాలంలో వసతిగృహాల సమీపంలో నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని వార్డెన్లకు సూచించారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించారు. మెనూ అమలుతీరు, సౌకర్యాల కల్పనపై ఆరాతీశారు. పదో తరగతి విద్యార్థులు కష్టపడి చదివి నూరు శాతం ఫలితాలు సాధించాలని సూచించారు. మెనూను పక్కాగా అమలుచేయాలని, విద్యార్థులకు కాచి చల్లార్చిన నీరు అందించాలని వార్డెన్లను ఆదేశించారు.

పగలే వెన్నెల



వరికుంటపాడు: మండలంలోని తిమ్మారెడ్డిపల్లిలో వీధిదీపాలు పట్టపగలే వెలుగుతున్నాయి. ఇటీవల కొత్తగా విద్యుత్ లైన్లను ఏర్పాటు చేశారు. వీధి దీపాలకు ప్రత్యేకంగా స్విచ్‌లు ఏర్పాటు చేయకపోవడంతో నిరంతరాయంగా వెలుగుతూనే ఉన్నాయి. దీంతో విద్యుత్ వృథా అవడంతో పాటు దీపాలు త్వరగా కాలిపోయే ప్రమాదం ఉంది. పంచాయతీ అధికారులు స్పందించి స్విచ్‌బోర్డును ఏర్పాటు చేసి విద్యుత్ వృథాను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

అల్లుకున్న నిర్లక్ష్యం



సీతారామపురం : మండలంలోని అయ్యవారిపల్లి ఎస్సీ కాలనీలో ప్రధాన రహదారి పక్కనున్న ఓ విద్యుత్ స్తంభాన్ని పిచ్చి తీగలు అల్లుకుపోయాయి. వాటిని తొలగించాల్సిన విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యం వహించడంతో బలమైన గాలులు వీచిన సమయంలో విద్యుత్ సరఫరాకు తరచూ అంతరాయం ఏర్పడుతోంది. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి తీగలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

వాల్టా చట్టానికి తూట్లు

- యథేచ్ఛగా పచ్చని చెట్ల నరికివేత
- బొగ్గుబట్టీలు, బ్యారెన్లకు కలప తరలింపు



ట్రాక్టర్‌పై అక్రమంగా తరలిపోతున్న కలప

సీతారామపురం : ఉదయగిరి నియోజకవర్గంలో వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తున్నారు. కొందరు అక్రమార్కులు యథేచ్ఛగా పచ్చని చెట్లను నరికేస్తున్నారు. కలపను అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇటీవల కాలంలో పొగాకు బ్యారెన్లతోపాటు బొగ్గు బట్టీలకు కలప అవసరం అవడంతో కల్పకు డిమాండ్ పెరిగింది. దీంతో కొందరు అక్రమార్కులు అటవీ భూముల్లో, రోడ్ల పక్కన ఉన్న చిల్ల, వేప, తుమ్మ, మర్రి చెట్లను నేలకూల్చి యథేచ్ఛగా కలపను తరలిస్తున్నారు. ఉదయగిరి అటవీ శాఖ రేంజ్ పరిధిలో వేల హెక్టార్ల విస్తీర్ణంలో చెట్లు ఉన్నాయి. దీంతో అక్రమార్కులు కొన్ని శాఖల అధికారులను ప్రసన్నం చేసుకుని చెట్లను నరికేసి కలపను తరలిస్తున్నారు. దీంతో పచ్చదనం కనుమరుగవుతోంది. ముఖ్యంగా కొండ కింద ప్రాంత గ్రామాల సమీపంలోని అటవీప్రాంతంలోని చెట్లను కూల్చేసి కలపను తరలిస్తుండడం నిత్య కృత్యంగా మారింది. దీన్ని అడ్డుకోవాల్సిన అధికార యంత్రాంగం రాజకీయ ఒత్తిళ్లతో చూసీచూడనట్లుగా వ్యవహరిస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నిబంధనలు గాలికి

ప్రభుత్వ నిబంధనల ప్రకారం పొలాలు, రహదారులు, కొండ ప్రాంతాల్లోని చెట్లను నరికాలంటే వాల్టా చట్ట ప్రకారం తహసీల్దార్ అనుమతి తీసుకోవాలి. ఆ తర్వాత రెవెన్యూ అధికారులు పరిశీలించి అటవీ అధికారులకు నివేదిక పంపుతారు. వారి అనుమతి కోసం ట్రాక్టర్‌కు రూ.500 చలానా చెల్లించాలి. రెండు శాఖల ఆమోదం లభించాకే చెట్ల నరికివేతకు అవకాశం ఉంటుంది. అయితే ఉదయగిరి నియోజకవర్గంలో వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తూ అక్రమార్కులు చెట్లను నరికి తరలిస్తున్నారు. నిత్యం ట్రాక్టర్ల ద్వారా కలప పెద్ద ఎత్తున తరలివెళ్తున్నా కేసులు మాత్రం నామమాత్రం. క్షేత్రస్థాయి సిబ్బందికి ముడుపులు చెల్లించి కలపను రవాణా చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

చర్యలు చేపడతాం



అటవీ ప్రాంతంలోని చెట్లను నరికితే సహించం. ఎవరైనా కలపను అక్రమంగా రవాణా చేస్తే వాహనాలను సీజ్ చేసి శాఖపరమైన చర్యలు తీసుకుంటాం.

–కేవీ ప్రసాద్, డీఆర్వో, సీతారామపురం

బాలికలు ఉన్నత శిఖరాలను చేరుకోవాలి



మాట్లాడుతున్న వార్డెన్ ఖాదరున్నీసా

ఆత్మకూరు : బాలికలు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని వార్డెన్ ఖాదరున్నీసా అన్నారు. పట్టణంలోని ఎస్సీ బాలికల వసతి గృహంలో జన విజ్ఞానవేదిక ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డెన్ మాట్లాడుతూ బాలికలు శారీరకంగా, మానసికంగా ధృడంగా ఉండాలన్నారు. ఉన్నత రంగాల్లో రాణిస్తున్న మహిళలను స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలన్నారు. అనంతరం పలువురు వక్తలు బాలికల హక్కులపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ కళాశాల అధ్యాపకురాలు వై మెర్సీ, జేవీవీ నాయకులు కేసీ కృష్ణయ్య, మల్లికార్జున, బీ శ్రీనివాసులు, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ షేక్ సంధాని, ప్రజానాట్యమండలి గాయకుడు షేక్ గద్దర్‌బాబు, రెడ్‌క్రాస్ కార్యదర్శి సాధిక్‌హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

తీరిక లేదా..నిధులు లేవా..?



ఆస్పత్రి ఆవరణలో దట్టంగా పెరిగిన పిచ్చి మొక్కలు



లీకవుతున్న డ్రైనేజీ పైపులు

- దుత్తలూరు పీహెచ్‌సీలో అధ్వానంగా పారిశుధ్యం
- పిచ్చిమొక్కలతో విషపురుగులు, దోమలకు ఆవాసంగా ప్రాంగణం



ఆస్పత్రి ఎదుట కనిపించని నేమ్ బోర్డు

దుత్తలూరు: పరిసరాల శుభ్రతతోనే ప్రజారోగ్యం ముడిపడి ఉంటుందని నిత్యం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ వైద్య సిబ్బంది చెబుతుంటారు. కానీ పీహెచ్‌సీల్లో అపరిశుభ్ర వాతావరణ పరిస్థితులు కనిపిస్తున్నా పట్టించుకోవడం లేదు. ఇందుకు దుత్తలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రమే ప్రత్యక్ష సాక్ష్యం. పీహెచ్‌సీ ఆవరణంలో పిచ్చి మొక్కలు దట్టంగా పెరగడంతో పాటు వర్షం పడితే నీరు నిల్వ ఉంటోంది. దీంతో దోమలు పగలు, రాత్రి అనే తేడా లేకుండా స్వైరవిహారం చేస్తున్నాయి. సెప్టిక్ ట్యాంక్ పైపులు లీకవుతూ పరిసరాలు దుర్గంధం వెదజల్లుతున్నాయి. వర్షాలు కురుస్తూ సీజనల్ వ్యాధులు ప్రబలుతుండడంతో రోగులు పీహెచ్‌సీకి క్యూ కడుతున్నారు. పీహెచ్‌సీలో అపరిశుభ్ర వాతావరణం నెలకొని ఉండడంతో కొత్త రోగాలు ప్రబలే అవకాశం ఉందని రోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల హైవే నిర్మాణంలో భాగంగా ఆస్పత్రి ప్రహరీని కూల్చి దారి ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో ఆస్పత్రి పేరును సూచించే బోర్డును తొలగించారు. తిరిగి బోర్డును ఏర్పాటు చేయకపోవడంతో పీహెచ్‌సీ దారి తెలియక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆస్పత్రిని తనిఖీ చేసి సిబ్బంది పనితీరును మార్చుకోవాలని, వైద్యశాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించినా పరిస్థితిలో మార్పులేదు. ఆస్పత్రి పరిస్థితిని చూసిన రోగులు పరిశుభ్రంగా ఉంచడానికి సిబ్బందికి తీరిక లేదా..నిధులు లేవా అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆస్పత్రి పరిసరాలను శుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని రోగులు కోరుతున్నారు.

సంపద సృష్టి అంటే ఇదేనా?



వింజమూరులో తుప్పపట్టిన చువ్వ

ఉదయగిరి: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదలకు జగనన్న కాలనీల్లో స్థలాలను కేటాయించి పక్కాగృహాలను మంజూరు చేసింది. అందులో భాగంగా ఉదయగిరి నియోజకవర్గంలోని దుత్తలూరు, ఉదయగిరి, వింజమూరు మండలాల్లోని గృహలబ్ధిదారులకు ఎన్నికలకు ముందు చువ్వ మంజూరు చేసింది. అంతలో ఎన్నికల కోడ్ రావడంతో అధికారులు లబ్ధిదారులకు చువ్వ పంపిణీ చేయలేదు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం జగనన్న కాలనీలపై కక్షతో చువ్వను పంపిణీ చేయకుండా నిలిపివేసింది. దీంతో గృహ నిర్మాణ శాఖ కార్యాలయాల వద్ద చువ్వ వర్షాలకు తడుస్తూ ఎండకు ఎండుతూ తుప్పు పట్టింది. సుమారు రూ.కోటి విలువ చేసే చువ్వ పనికి రాకుండా పోయింది. కొన్ని చోట్ల దొంగలు కొంతమేర దొంగలించి సొమ్ము చేసుకున్నారు. కొన్నిచోట్ల ఇంటి దొంగలే చువ్వను మాయం చేశారు. గృహ లబ్ధిదారులకు పంపిణీ చేసి ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదు. ప్రజాధనం ఉపయోగపడేది. చువ్వను నిరుపయోగంగా పడేయడాన్ని చూసిన పలువురు సంపద సృష్టించడం అంటే ఇదేనా? అని ప్రభుత్వ తీరును చర్చించుకుంటున్నారు.

నూతన కార్యవర్గ ఏర్పాటు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నగరంలోని గాంధీబొమ్మ సెంటర్ వద్ద ఉన్న డీసీసీ బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో శనివారం నిర్వహించారు. అనంతరం అసోసియేషన్ రాష్ట్ర నాయకులు వెంకటేశ్వరరాజు, మహేష్, మీర్‌ఖాసింవలీ, కుమార్‌పాల్ హాజరై, రానున్న కాలంలో బ్యాంక్ అభివృద్ధికి అసోసియేషన్ సభ్యుల పాత్ర, తీసుకోవాల్సిన నిర్ణయాలు, భవిష్యత్తులో చేపట్టాల్సిన విధి, విధానాలపై చర్చించారు. కాగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షులుగా సుష్మారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా శ్రీహరిబాబు, ట్రెజరర్‌గా గురున్నాథం, జాయింట్ సెక్రటరీగా సత్యవతి, అడ్వైజర్స్‌గా ఫణీంద్రబాబు, గౌస్‌బాషా, అసిస్టెంట్ సెక్రటరీగా షాజిద్, సెక్రటరీగా ఇబ్రహీం, మహిళా సెక్రటరీగా గాయత్రి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం వారిని పలువురు అభినందించారు.